

# అబద్ధం ఆడినందుకు...

రచన: కె. వి. రమణ

సాయంసమయం. ఇంకా కొద్దిగా ఎండ పడుతోంది. మెడికల్ స్టూడెంట్సు లేడీస్ హాస్టలు డాబామీద విద్యార్థినులు అటూ యిటూ పచార్లు చేస్తున్నారు. కొంతమంది ఏవో విషయాలను చర్చించుకుంటూ కిలకిలా నవ్వుకుంటున్నారు. మరికొంతమంది డాబా గోడ మీద కూర్చుని ప్రకృతి సోయగాన్ని వీక్షిస్తూ ఆలోచనల్లో నిమగ్నులవుతున్నారు.

ఎత్తైన రాతిమీద రోజూలానే రాజు, విజయకుమార్, రమణవచ్చి కూర్చున్నారు. వీరు ముగ్గురూ దగ్గరస్నేహితులు. కాలేజీలో చదువుకుంటున్నారు.

వాళ్ల ముగ్గురిలో రమణ చాల అమాయకుడు. దాన్ని ఆధారంచేసుకుని తక్కిన యిద్దరూ రాజూ, విజయకుమార్‌లు అతడిముందర అమ్మాయిల్నిగూర్చి తాము చేస్తున్న సాహస కార్యాల్ని వర్ణించుక పోతారు. అమాయకుడయిన రమణ నిజమేకాబోలనుకుంటాడు. ఇది నిత్యకృత్యం. అన్నీ కోతలే.

ఆనాడు ముగ్గురూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. విజయకుమార్ తలెత్తి మాట్లాడబోయాడు. రమణకు తెలుసు-అతను ఏంమాట్లాడేదీను. తను వాళ్ళముందు అమ్మాయిల విషయంలో అజ్ఞానుడని ఋజువయ్యాడు. కాలమంతా ఒకేలా వుంటుందా?

రమణ మెల్లగ తలెత్తి విజయకుమార్‌వైపు చూశాడు. వ్రేలితో హాస్టలు డాబామీద వోమూల అందంగా నిలబడి వీళ్ళవైపే చూస్తున్న వొక విద్యార్థిన్ని చూపించి "చూశావా?" అన్నాడు.

రాజు, విజయకుమార్ చాల ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ లేనిది నిర్భయంగా తమవైపే చూస్తున్న ఆ విద్యార్థినివైపే చూపిస్తున్నాడేమిటి? ఇంతధైర్యం వీడికెలావచ్చింది? ఆమెకూ వీడికీ ఏదైనా సంబంధంవుందా?

ఇక అట్టే ఆశ్చర్యపోయినట్టు కనిపిస్తే బాగుండదని రాజు అన్నాడు-"ఇంతకీ ఏమిటి సంగతి?"

విజయకుమార్ అడిగాడు - "ఆ అమ్మాయి పేరేమిటి?"

"ఆ పేరుసంగతి మాత్రం అడగకండి" రమణ అన్నాడు.

రాజుకీ, విజయకుమార్‌కీ బాగా తెలుసు-రమణకు ఏ అమ్మాయితోనూ పరిచయంలేదని.

రాజు అన్నాడు - "నాకు తెలుసునోయ్, నీవు ఆ అమ్మాయిని ఎందుకు చూపిస్తున్నావో. ఆమెకూ, నీకూ పరిచయం వుందని తెలియజేయటానికేగా ఆమెను చూపిస్తున్నావు?"

విజయకుమార్ అన్నాడు-"మమ్మల్ని నీవు మోసగించలేవోయ్. మేం ప్రతీ రోజూ అమ్మాయిలగురించి చెబుతున్నామని సహించలేక నీవా అమ్మాయిని చూపిస్తున్నావుగదూ? ఒరేయ్ రాజూ, వీడికీ ఆమెకూ కొద్దిగాకూడ పరిచయం లేదు నిజానికి"

రమణ కొంచెం గాభరాపడ్డాడు. వీళ్ళిద్దరూ తనవిషయం కనిపెట్టేసినట్టున్నారు. ఇప్పుడేమిటి చేయడం. వాళ్ల దగ్గర యిప్పుడు మెత్తబడిపోతే మరింత వేళాకోళం చేస్తారు. ఇప్పుడేమైనా సరే తనమాట మీద నిలబడడమే శ్రేయస్కరం. రమణ తలవంచుకొని అన్నాడు-"మీరు నమ్మితే నమ్మండి, నమ్మకపోతే మానేయండి. ఆమెకూ, నాకూ బాగా పరిచయముంది."

రమణచెప్పిన మాటలతీరు చూస్తుంటే నమ్మకం కలుగలేదు వాళ్ళిద్దరికీ. రాజు అన్నాడు-"వాస్తవంగా ఆమెకూ, నీకూ పరిచయం వున్నట్లయితే ఆమె దగ్గర కిప్పుడువెళ్లి మాట్లాడు చూదాం"

ఈ మాట వినగానే రమణ గుండెలో రాయిపడింది. ఆడవాళ్ళముందు తనెప్పుడూ మాట్లాడి ఎఱుగందే? రమణ లేచి నిలబడ్డాడు ఒకప్రక్క భయంగా వున్నా, వాళ్ళిద్దరితో అన్నాడు-"సరే, ఆమెకూ-నాకూ పరిచయం లేదని మీరిద్దరూ అంటున్నారు. పరిచయం వుందని యిప్పుడే నేను ఋజువుపరుస్తాను." అతడక్కడినుండి హాస్టలు వైపు దారితీశాడు. రాజు, విజయకుమార్ తెల్లమొగంవేసి అటుకేసి చూస్తూ వుండిపోయారు. రమణ చెప్పింది నిజమేననేసందేహం కలిగిందీ.

హాస్టలు డాబామీద ఆ మూలన నిలబడ్డ విద్యార్థిని వాళ్ళముగ్గురినీ చాల సేపటినుండి చూస్తూవుంది. తనవైపు చేయిచూపి ఏదో చెప్పడం కూడ చూసింది. ఆమె అనుకుంది-తనగురించి వాళ్ళు ఏదో అనుకుంటున్నారని. ఎక్కడైనా ఆడాళ్ళు కనిపిస్తే చాలు, వెక్కిరించడాలు, చేయిచూపడాలు జరుగుతాయి అనుకొంది. కొంతసేపటికి ఓ యువకుడు హాస్టలు వైపు రావడం చూసింది. బహుశా తనగురించే అయి వుంటుంది. వీడికి తగిన బుద్ధిచెప్పాలి, లేకపోతే మితిమీరుతారు. దారిలో పోయేటప్పుడుగూడ వేళాకోళం చేస్తారు.

రమణ బిక్కుబిక్కుమంటూ అక్కడకు చేరుకున్నాడు. డాబామీదనున్న ఆమెప్రక్క చూశాడు. ఆమెకూడ అతడ్ని చూసింది. రమణ 'ఆమెను ఎలాపిలవాలి?' అని ఆలోచిస్తున్నాడు. ఈ లోపున ఆమె క్రిందికిదిగి అతడిదగ్గరికి వచ్చింది. ఆమెను చూసేసరికి రమణముఖం వాడిపోయింది.

"ఎందుకొచ్చారిక్కడికి?" ఘాటిగా అడిగింది.

"నేనాండీ?... నేనాండీ..."

"అవును, మీరే. ఎదురుగుండావున్న మిమ్మల్నిగాక ఎవర్ని ప్రశ్నిస్తున్నాననుకున్నారు? 'ఎందుకొచ్చారిక్కడికి?' అని అడిగితే అలా నానుడుగా మాట్లాడతారేం? ఇంతకీ ఎవరిగురించి వచ్చారు మీ రిక్కడికి?"

మెల్లగా అన్నాడు "మీగురించే?"

"ఆఁ! నాగురించా? మీరేనా నావైపు చేయిచూపించి ఏదో అంటున్నారు వాళ్లతో?"

"......................"

"మీరే నన్నమాట. సరే! మీరు నా గురించి ఏమిటి చెబుతున్నారు వాళ్లతో? చెప్పవలసిన అవసరం ఏమిటివచ్చింది? అయినా ఏ బీచికో చల్లగాలికి పోవలసిన వాళ్ళు యిక్కడికివచ్చి కూర్చోడానికి కారణం ఏమిటి? అడాళ్ళ అందాన్ని చూడటానికేనా? ఏం జవాబుచెప్పరేం?"

రమణ ఈలోపున ఏదో ఆలోచించుకున్నాడు–"మరి యిలా ప్రశ్నలవర్షం కురిపిస్తే ఎలా? నేను మీగురించి ఒక అత్యవసరమైన పనిమీద వచ్చాను."

"ఒక అపరిచిత స్త్రీతో అత్యవసరమైన పనిగురించి మాట్లాడటానికి వచ్చారా? ఇక వెళ్లండి – ఇటువంటి బుద్ధితక్కువ పనులు చెయ్యకండి యికముందు" ఆమె వెనక్కి తిరిగి లోనికి వెళ్లిపోబోయింది.

"నన్ను అపార్థం చేసుకోకండి. మీ చిన్నాన్నగారు చనిపోయారు. ప్రొద్దున్న మా కాలేజీకి ఎవరో మనిషివచ్చాడు. అతడు మీ ఫోటో, ఎడ్రసువున్న కాగితం కూడ తీసికొచ్చాడు. మిమ్మల్ని కలుసుకోవాలని ఆతడు చాల ఆత్రుతపడ్డాడు. కాని అతనికి మీరుండేస్థలం తెలియలేకపోయింది. నిరాశతో తిరిగి వెళ్లిపోతుంటే ఆ ఫోటో, ఎడ్రసు తీసుకున్నాను. మీకా విషయం తెలియజేద్దామని. వాటిని తీసుకరావడం మర్చిపోయాను. మా యింట్లో వున్నాయి. ఆవిషయం తెలియచేద్దామనే యిప్పుడిక్కడికివస్తే మీరు నన్ను నానామాటలు అంటున్నారు. సరే యిక వెళ్తాను."

అతడిమాటలు ఆమెపై పిడుగుపాటులా పనిచేశాయ్. వెనక్కి తిరిగి అతడివైపు చూసింది. అతడిముఖం పాలిపోయివుంది. కారణం–అతడు చెప్పినసంగతి నిజంగా జరగలేదు అతడిముఖం చూడగానే ఆ విషయం నిజంగా జరిగేవుంటుందనే నమ్మకం కలిగింది. ఆ తలంపు రాగానే ఆమెకళ్ల నుండి బొటబొటా కన్నీళ్ళు కారసాగాయి. అనవసరంగా అబద్ధంచెప్పి ఒకస్త్రీ కన్నులనుండి కన్నీరువచ్చేటట్టు చేస్తున్నానుకదా అనేభావం కలగటం చేత రమణ కనుకొలకుల్లో కన్నీళ్ళు నిండుకున్నాయి.

"వెళ్తానండి," అన్నాడు రమణ బొంగురుపోయిన కంఠస్వరంతో.

తనవెంట రమ్మని సంజ్ఞచేసి లోపలికి నడిచింది ఆమె. వెళ్దామా, వెనుతిరిగి పోదామా అనే సందిగ్ధంలోపడ్డాడు రమణ. ఇంతవరకూ కథ నడిచాక యిక వెనుకాడితే బాగుండదని ఆమె వెంట నడిచాడు.

గదిలోకి వెళ్ళినతరువాత కుర్చీలో కూర్చోమని చెప్పింది. తను కుర్చీలో కూర్చుని గది నాలుగువంకల పరికించాడు. అందమైన దేశనాయకుల పటాలు తగిలించబడి వున్నాయి. అక్కడక్కడా సినిమాతారల క్యాలండర్లు కూడ వ్రేలాడుతున్నాయి. స్టేండుపై జాకెట్లు, చీరలు పడివున్నాయి.

"మీరు యిక్కడే కూర్చోండి, నేనిప్పుడేవస్తాను" కన్నీళ్ళు తుడుచుకొని రూము బయటకు వెళ్లిపోయింది ఆమె.

రమణ గుండెలు దడదడా కొట్టుకున్నాయి. తను ఆడిన అబద్ధం ఆమెకు తెలిసిపోయిందేమో? ఇప్పుడెలాగ? ఆమె బయటకు వెళ్లిపోయింది. ఎవరినైన తీసుకవచ్చి తనను తన్నించడానికేమో! ఇప్పుడేమిచేయాలి? గదిలోనించి పారిపోవడానికి మరేమార్గమూ లేదే? రమణ ఏదో ఆలోచించుకున్నాడు. తలుపుప్రక్కకువెళ్లి దాక్కున్నాడు. ఇంతలో ఎవరో వస్తున్నట్టు చప్పుడైంది. ప్రాణాలు బిగపట్టుకుని నిల్చుండిపోయాడు.

గదిలోకి ఆమె వచ్చింది. బల్లమీద ఫ్లాస్కు నుంచింది. అతను కనబడకపోవటం చూసి ఆశ్చర్యపోయింది. "ఏమండీ," అని పిల్చింది. రమణ తలుపుప్రక్కన వున్నాడేగాని జవాబివ్వలేదు. తన్నించటానికి బయట ఎవరినైనా వుంచి తను లోపలికివచ్చి యిలా నటిస్తుందేమోనని అనుకున్నాడు. ఆమె నలువంకలా చూసింది. తలుపుప్రక్కన వున్న రమణ ఆమెకు కనిపించాడు. అతడు కండ్లు మూసుకుని నిలబడి వున్నాడు.

"ఏమండీ! పిలిస్తె పలకరేం?" అన్నది ఆమె కొద్దిగా నవ్వుతూ.

ఇక జరిగేది ఎలానూ జరుగుతుంది అని అనుకుని రమణ అన్నాడు–"ఈ తలుపుప్రక్కవున్న కేలండర్లు చూద్దామని వచ్చాను. తల తిరగటంచేత యిలా నిల్చుండిపోయాను."

ఆమె అతడి దగ్గరగావచ్చి చెయ్యి పట్టుకుంది. రమణ అదోలా ఫీలయ్యాడు. తన్నులు తప్పవనుకున్నాడు. అందు గురించే ఆమె తన రెండుచేతులూ పట్టుకుంది. తెల్లమొగంవేసి నిలబడిపోయాడు.

"చెయ్యి వదిలిపెట్టండి," అన్నాడు.

"ఫరవాలేదు లెండి. మీ ముఖం అలా పాలిపోతుందేమి? రండి, కుర్చీలో కూర్చోండి,"

రమణ కుర్చీలో కూర్చోక తప్పలేదు.

"ఏమండీ! మీరు అంత విచారంగా వున్నారేం? వొంట్లో బాగాలేదా?" కాఫీ కప్పులోపోస్తూ అంది.

"వొంట్లో బాగానేవుందండి" ఇంతవరకూ అబద్ధమాడాడు. అలా చేయటం ప్రమాదకరం. నిజం చెప్పటమే శ్రేయస్కరం అని ఆలోచించుకుని "మీతో చెప్పరాని సంఘటన చెప్పి విచారం కలిగించాను క్షమించండి! అన్నాడు.

ఆమాట వినగానే ఆమె కళ్లనుండి కన్నీళ్ళు జలజలా కారాయి. రమణ జేబునుండి రుమాలు తీసి ఆమెచేతి కందించాడు. ఆమె కన్నీళ్లు తుడుచుకుని కప్పుతో కాఫీ అతని కందించింది.

కాఫీలో ఏమైనా కలిపిందేమోనని సందేహం కలిగింది. ఆ విషయం తెలుసుకోటంకోసం మరోకప్పులో సగం కాఫీపోసి ఆమె కందించాడు.